

# వెన్నెలదీపాలు

## – డా.యండమూరి వీరేంద్రనాథ్



*(యండమూరి వీరేంద్రనాథ్ గారి రచనాశైలి గురించి పాఠకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చెప్పే అంశం ఏదైనా, మనసుకి హత్తుకునేలా, మనసుల్ని కదిలించేలా అక్షరరూపం ఇవ్వడం యండమూరిగారి ప్రతి రచనలోనూ స్పష్టంగా కన్పిస్తుంది. ఆయన వ్రాసిన 'విజయానికి ఆరో మెట్టు' పుస్తకంలోని చిన్నచిన్న సంఘటనలను ప్రతినెలా మీకందిస్తున్నాము. ప్రతి సంఘటనా ఏదో ఒక నిత్యజీవితసత్యంపై వెలుగులు ప్రసరింపచేస్తుంది.. అన్నీ కలిపి వెన్నెలదీపాల్లా మన మనసుల్ని వెలిగిస్తాయి. వీరేంద్రనాథగారి ప్రత్యేక అనుమతితో ఈ చిన్న కథలు కౌముది పాఠకులకోసం..)*

(గత సంచిక తరువాయి)

***బీదరికంలోంచి ఐశ్వర్యంలోకి***

జీవితంలో ఏ స్థాయినుంచి అయినా గెలుపుని ప్రారంభించవచ్చు. ఈ విషయాన్ని ఎందరో ఎన్నిసార్లో నిరూపించారు చరిత్రలో.

కిమ్‌వూచుంగ్ అనే వ్యక్తి తన ఆత్మకథలో ఈ విధంగా వ్రాసాడు.

"కొరియా యుద్ధసమయంలో, నా పధ్నాలుగు సంవత్సరాల వయస్సులో నా తండ్రిని శత్రువులు కిడ్నాప్ చేశారు. మొత్తం సంసార బాధ్యతంతా నా భుజాలమీద పడింది. న్యూస్ పేపర్లు అమ్మటం దగ్గరనుండి పడవలో ప్రయాణికుల్ని ఒక ఒడ్డునుండి అవతలి తీరం వరకు చేర్చటంలాంటి రకరకాల పనులు చేస్తుండేవాడిని. ఒకరోజు పెద్దగాలి వచ్చి ఏ పనీ దొరకలేదు. డబ్బులేమీ తీసుకువెళ్ళకుండా ఇంటికి వెళ్ళాను. మా అమ్మ "మేమందరం తినేసాంరా. నీకోసం కొంచమే ఉంచాం" అంటూ అన్నం గిన్నె ముందు పెట్టింది. నాకు బాగా దుఃఖం వచ్చింది. నేను కూడా బయటే తిని వచ్చానని అబద్ధం చెప్పాను. ఆ రోజు గిన్నెలో వున్న ఆ కొద్ది అన్నం మేమెవరం తినలేదు. ఆ సంఘటన ఇప్పటికీ నాకు గుర్తుంది. ఎప్పటికయినా ఈ ప్రపంచాన్ని గెలవాలనుకున్నాను" అంటారు కిమ్. ప్రస్తుతం ఆయన ప్రపంచంలోని పెద్ద పెద్ద కోటీశ్వరులలో ఒకడు. కొరియాకు సంబంధిన దేవూ గ్రూపు అనే మాటిజ్ కార్ల కంపెనీకి అధిపతి.

***నిజమైన నమ్మకం.***

ఒక మనిషి జీవితంలో గెలవాలన్నా ఓడిపోవాలన్నా నమ్మకం ముఖ్యం. 'రఘుపతి రాఘవరాజారాం' అన్న నాటకంలో నేనొక డైలాగ్ 'భగవంతుడి మీద నమ్మకం లేక మందు వేసుకుంటారంట. మందు మీద నమ్మకం లేక గుండు కొట్టించుకుంటారంట' అని వ్రాశాను. మనిషికి తన మీద తనకి నమ్మకం వుంటే సగం పనులు నెరవేతతాయి అన్న కథాంశమే ఈ విజయానికి ఆరో మెట్టు పుస్తక సారంశం. నాలుగు బాణాలు వేస్తే ఏదో ఒకటి తగలకపోతుందా అనుకోవటం ఒక పద్ధతి. ఒకే బాణంపై ఏకాగ్రత నిలిపి, నమ్మకంతో వేయటం మరో పద్ధతి. 'సంశయాత్మావినశ్యతి' అన్నాడు శ్రీకృష్ణుడు. సంశయించేవాడికి దొరికేది వినాశనమే అని దాని అర్థం. తాను చేస్తున్న పనిని సంశయించేవాడు జీవితంలో ఎన్నటికీ గెలవలేడు. వేలంపాటలో నీ మొహంలో కనబడే బెరుకే, అవతలి వ్యక్తికి ధైర్యాన్ని ఇస్తుంది. ఈ

సత్యం వ్యాపారానికీ, జీవితానికీ కూడా వర్తిస్తుంది. దేనికయినా కావల్సింది 'నమ్మకం'. నీ పట్ల నీవు చేస్తున్న పనిపట్ల కాన్ఫిడెన్సు. నమ్మకం గురించిన ఒక ఫాటసీ కథ చదవండి.

ఒకరోజు పురాణ కాలక్షేపానికి ఒకామె తన పదేళ్ళ చిన్నకొడుకుని తీసుకుని వెళ్ళింది. శ్రోతలందరూ నిశ్శబ్దంగా, శ్రద్ధగా వింటూ వుండగా ఆయన ఇలా చెప్పాడు "మీరు తలచుకుంటే కానిది ఏమీ లేదు. కేవలం భగవంతుడిని నమ్మండి. ఏమికావాలంటే అది మీకు దొరుకుతుంది. మీరేమి అడిగితే దేవుడు అది ఇస్తాడు."

ఆ మాటలకి హాల్లో పెద్ద విజిల్ వినపడింది. తల్లి ఉలిక్కిపడి ప్రక్కనే వున్న కొడుకు తొడగిల్లి "ష్.అల్లరి చేయకు" అంది.

గుడినుండి ఇంటికి వస్తూండగా ఆమె కొడుకుతో "ఎందుకురా ఆయన అంత నమ్మకంగా చెబుతూంటే అలా ఎగతాళిగా విజిల్ వేశావు?" అని అడిగింది. ఆ కుర్రాడు అమాయకంగా "నేను వేయలేదమ్మా" అన్నాడు.

"మరి?"

"మనకు నమ్మకం వుండి భగవంతుడిని ఏమి అడిగితే అది ఇస్తాడని ఆయన చెప్పాడుగా."

తల్లి అనుమానంగా "అవును ఏమి అడిగవు" అంది.

"నాకు విజిల్ ఎలా వేయాలో నేర్పమని అడిగాను."

మనకి చాలా అవసరమైనవి.

మనిషికి ప్రకృతి చేసిన ద్రోహం ఏమిటంటే అవసరమైన వాటి మీద ఉత్సాహం కలిగించక పోవటం, అనవసరమైన వాటి మీద ఉత్సాహం పెంచటం. పిల్లల్లో కార్టూన్ సీరియల్స్‌పై వున్న ఆసక్తి, కెమిస్ట్రీపై ఉండదందుకే. ఈ విషయాలు చూడండి. పెద్దగా అవసరంలేకపోయినా తెలుసుకోవటానికి ఎంత ఉత్సాహంగా ఉంటాయో.

ఒక ఆరోగ్యకరమైన వ్యక్తి రోజుకి ఆరుసార్లు బాత్‌రూమ్‌కి వెళతాడు. రోజుకి 47నిముషాలు సగటున అక్కడ గడుపుతాడు. అంటే జీవితకాలంలో దాదాపు రెండున్నర సంవత్సరాలు అన్నమాట.

ప్రపంచాన్ని భయభ్రాంతుల్ని చేసిన "సైకో" (1960 తెలుపు నలుపు) సినిమాలో రక్తం ఎఫెక్టుకోసం చాక్లెట్ ద్రవం వడారు.

ఆవలింత జీవితం ఆరు సెకన్లు.

"ఈజిప్టులో ఒక పెద్ద పిరమిడ్ కట్టడానికి ఆ రోజుల్లో 4 లక్షలమంది కూలీలకు ఇరవై ఏళ్ళు పట్టింది.

స్టాంపులు కలెక్ట్ చేసేవారిని ఫిలటెలిస్ట్‌లంటారు. వివిధ దేశాల పోస్ట్‌కార్డులనీ, బ్యాంక్‌ల నోట్లనీ, సిగరెట్ పెట్టెల్నీ సేకరించే వారిని వరుసగా DILTIOGIST, NOTAPHILE, BANDOPHILE అంటారు.

నీటి మీద ఐసు తొమ్మిది వంతు పైకి తేలుతుంది.

ఒకటి నుంచీ వందలోపు అంకెల్లో తొమ్మిది ఎన్నిసార్లు వస్తుంది? సమాధానం ఇరవైసార్లు.

ఒక విద్యార్థి కాలేజీ ప్రవేశించే సమయానికి, టి.విలో అయితేనేం, సినిమాల్లో అయితేనేం యాభైవేల భీభత్స దృశ్యాలని చూసి ఉంటాడు.

జింబాబ్వే ప్రెసిడెంట్ కానన్ (ఫిరంగి) బనానా (అరటిపండు) తన పేరుని ఎవరూ అపహాస్యం చేయకుండా, తన పేరు మీద ఎవరూ జోకు వెయ్యకుండా చట్టం రూపొందించాడు.

మొహానికి కొమ్ములు, చెవులు, శరీరానికి మేక కాళ్ళు వుండే భయంకరమైన (గ్రీకు) దేవుడి పేరు పాన్. ఆ దేవుడి పేరుమీదే పానిక్ (భయం) అన్నపేరు వచ్చింది.

ఈ ప్రపంచంలో అన్నిటికన్నా బెస్ట్ అభినందన ఏమిటో తెలుసా? " బ్రతికున్నంతకాలం జీవించు"

అమ్మాయిల్తో మాట్లాడటానికి బిడియపడే అబ్బాయిల భయాన్ని 'గైనోఫోబియా' అంటారు.

***కమిట్‌మెంట్***

జీవితంలో కాస్తయినా మంచి పేరు రావలంటే కాసింతయినా కమిట్‌మెంట్ ఉండాలి. తీసుకున్న అప్పు సమయానికి తీర్చటంలాంటి పెద్ద పెద్దవి కాదు. చెప్పిన టైమ్‌కి వెళ్ళలేకపోతే, 'ఆలస్యం అవుతుంది' (రావటం) అన్న చిన్న విషయాన్ని కూడా చెప్పరు చాలామంది. చేతిలో సెల్‌లూ, ఇంట్లో ఫోన్‌లూ ఉంటాయి అందరికీ. కానీ నిర్లక్ష్యం. ఎదురు చూస్తార్లే అన్న ధీమా. 'ఎందుకిలా జరిగింది?' అని అడిగితే, అనుకోని అవాంతరం వచ్చింది అంటారు. వారి దృష్టిలో అది 'ఫోన్ చేసి చెప్పటానికి కూడా సమయం లేనంత' పెద్ద అవాంతరం. అదే విధంగా, ఎవర్నయినా పార్టీకి పిలిస్తే, కొందరు తమతోపాటు (చెప్పకుండా) మరొకర్ని తీసుకువస్తారు. హోస్ట్ ఇబ్బంది ఆలోచించరు. అంతెందుకు? ఇద్దరి దగ్గిరా ఫోన్‌లు వున్న సందర్భంలో కూడా, వారు మన ఇంటికొస్తున్నప్పుడూ, వస్తున్నామని చెప్పరు. మనం మరేదో పనిలో ఉంటామని కూడా ఆలోచించరు. అంతెందుకు? ఇద్దరి దగ్గిరా ఫోన్‌లు వున్న సందర్భంలో కూడా, వారు మన ఇంటికొస్తున్నప్పుడు, వస్తున్నామని చెప్పరు. మనం మరేదో పనిలో ఉంటామని కూడా ఆలోచించరు 'రావటమే' వారు మనకిచ్చిన వరంలా భావిస్తారు. మరి కొందరు అర్ధరాత్రి రైలెక్కి, నిద్రపోతున్న వారిని పట్టించుకోకుండా పెద్ద గొంతుతో సంభాషణ ప్రారంభిస్తారు.

చిన్న చిన్న విషయాల్లోనే కమిట్‌మెంట్ లేనివారు జీవితంలో ఎలా పైకి రాగలరు?

***అయిదు అవసరాలు***

మనుష్యులు అయిదు సందర్భాల్లో ప్రవర్తించకూడని విధంగా ప్రవర్తిస్తారని సిగ్మెడ్ ఫ్రాయిడ్ అంటాడు.

1. సమర్ధన: (సిగరెట్ వెలిగించబోయే ముందు) ఒక్క సిగరెట్‌కే కేన్సర్ వస్తుందా ఏం? ఏ ఆనందమూ లేకుండా వందేళ్ళు బ్రతకటం కన్నా సిగరెట్ తాగుతూ తొంభై ఏళ్ళు బ్రతకటం నాకిష్టం.

2. అంతర్ముఖం: (తప్పు తనది కాదని తెలిసినా కూడా) ఇవన్నీ వివరించి చెప్పటం అనవసరం. ఎలాగూ నా భార్య అర్ధం చేసుకోవటం జరగదు.

3. సరఫరా: (తనని పై వాళ్ళు తిట్టినప్పుడు) హమ్మయ్య ఇప్పుడు నా క్రిందివారిని తిట్టాక మనసు కాస్త ప్రశాంతంగా ఉంది.

4. సాకు: (మార్కులు తక్కువ వచ్చినందుకు స్నేహితురాలితో) పరీక్ష ముందు రోజు రాత్రి బాగా తలనొప్పి వచ్చింది. చదువుమీద ఏకాగ్రత నిలపలేకపోయాను. అర్ధం చేసుకుంటావ్ కాబట్టి నీకు చెపుతున్నాను.

5. చెరువుమీద కోపం: నాకు కావల్సిన టి.వి ఛానెల్ చూడటం విషయంలో నా భార్యతో గొడవైంది. అందుకే మూడ్‌పాడయింది. రాత్రి నిద్రపట్టలేదు. ఈ రోజు ఎందుకో బాగా తాగాలనిపించింది. వస్తూ వస్తూ కారు ఆక్సిడెంట్ చేయబోయాను కూడా.

పై అయిదూ కీడు చేస్తాయని అంటాడు ఫ్రాయిడ్ కరెక్టే కదా.

మీకు గుర్తుందా?

1. ట్విన్ టవర్స్ అమెరికాలో కూలిపోయినప్పుడు మీరెక్కడున్నారు?

2. రాథోడ్‌కి ఒలింక్స్‌లో రజిత పతకం వచ్చిందని మీకు ఎలా, ఎంతకాలానికి తెలిసింది?

3. మీకిష్టమైన సినిమా మీరు అన్నిసార్లు చూడటానికి కారణం ఏమిటి?

4. తిరుపతిలో చంద్రబాబు నాయుడు మీద హత్యాప్రయత్నం జరుగుతున్న సమయానికి కరెక్టుగా మీరెక్కడున్నారు.

5. బాలకృష్ణ షూటవుట్‌లో గాయపడిన ఇద్దరి పూర్తిపేర్లు ఏమిటి?

6. డయానా స్నేహితుడు ఎవరు?
7. నక్సల్స్ చర్చలు ఫలిస్తాయా?
8. మీకు ఫలానా నటి/నటుడు అంత బాగా ఎందుకు నచ్చుతాడు? కారణాలేంటి?
9. మిలీనియం ప్రారంభంలో రాత్రి పన్నెండుగంటలకు ఏం చేస్తున్నారు?
10. మీరు ఆఖరుసారి రైల్లో ప్రయాణం చేసి ఎన్ని నెలలయింది?

కాలం విలువ, గమ్యం విలువ తెలియని వ్యక్తులు, తమకి ఏ మాత్రం సంబంధంలేని విషయాల గురించి ఎంతో చర్చిస్తూ సమయాన్ని వృధా చేసి, తరువాత మర్చిపోతారు.

***అందమైన రిస్క్***

మనల్ని ఆకర్షితుల్ని చెయ్యటానికి ఎలాంటి ప్రకటనలు టివిలో వస్తూ ఉంటాయో చూడండి. ఫలానా అదృష్టపు రాళ్ళుకొని మీ ఇంట్లో పెట్టుకోండి. మా భస్మం వాడకపోతే మీరు డయాబిటిస్‌తో ఛస్తారు. ఈ తుమ్మెదని మీ పోట్టకి తగిలించుకోండి. మిస్.ఇండియాలా సన్నబడతారు. మరొక ఉదాహరణ చూడండి.

ఒక కుటుంబం హోటల్‌కి వెళ్తుంది. పిల్లలు ఖరీదైన కూరలు కావాలంటారు. తల్లి 'వద్దు అందరం ఒకే దానిలో సర్దుకుందాం' అంటుంది. తండ్రి విచారంగా చూస్తాడు.

మరో అమ్మాయి, అందమైన ముత్యాన్ని చూసి ముచ్చట పడుతుంది. ఖరీదు చూసి తల్లి విషాదంగా ఇంకో చౌక అయినది సెలెక్ట్ చేస్తుంది. అంతలో ఒక బ్యాంకు పేరు వస్తుంది. మా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే మీరిక ధరలు చూడనవసరంలేదు అన్న ప్రకటన వస్తుంది. అంతవరకూ బాగానే ఉంది. కానీ ఆ తరువాత, వెనుకనుంచి ఒక గంభీరమైన గొంతు, "ఈ లాభాలన్నీ రిస్కుకి సంబంధించినవి. మీ జాగ్రత్తలో మీరు ఉండండి" అంటుంది. అదే ట్రాజడీ.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments